ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 31.0
కనిష్ఠం 22.0

ANDHRAJYOTHY



సూర్యాపేట

5

సోమవారం 11 నవంబరు 2024



నృసింహుడికి శాస్త్రోక్తంగా
నిత్య పూజలు
- భక్తజనసంద్రంగా క్షేత్రం
- స్వామివారిని దర్శించుకున్న 40వేల మంది భక్తులు 6



జరిమానాలేగా.. వేసుకోనీ!

జిల్లా రహదారులు నిత్యం నెత్తురోడుతున్నాయి. ఇంటి నుంచి వాహనాలపై బయటి కి వెళ్లిన వ్యక్తులు తిరిగి క్షేమంగా చేరుకుంటారనే నమ్మకం సన్నగిల్లుతోంది. ఏదో ఒక చో ట వాహన ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఈ ప్రమాదాల్లో ఎంతో మంది విలువైన ప్రా ణాలు పోగొట్టుకుంటున్నా రు. మరి కొంత మంది క్షతగాత్రులవుతున్నారు. ఈ ప్రమాదాలకు అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి,సూర్యాపేటక్రైం)


- యథేచ్ఛగా ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన
- ప్రమాదాలు జరుగుతున్నా కానరాని మార్పు
- నిత్యం ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదం
- అతి వేగం, రాంగ్‌రూట్, మద్యంమత్తే ప్రధాన కారణం
- ఈ ఏడాది 472 రోడ్డు ప్రమాదాలు
- ప్రమాదాల్లో 204 మంది మృతి, 456 మందికి గాయాలు

పోలీసులు ప్రతి రోజు వాహన తనిఖీలు నిర్వహిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానా విధిస్తున్నా వాహనదారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. జరిమానా చెల్లిస్తున్న వాహనదారులు షరామామూలంటూ ట్రాఫిక్ నిబంధనలను మళ్లీ ఉల్లంఘిస్తూనే ఉన్నారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నా వారిలో మార్పు రావడం లేదు. జిల్లాలో గతంలో రహదారుల విస్తరణ జరగకముందు పలు ప్రమాదాలు జరుగుతుండేవి. దీంతో రహదారులను విస్తరించగా, ప్రమాదాలు తగ్గాల్సింది పోయి పెరుగుతున్నాయి. రహదారుల విస్తరణతో వాహనాల వేగం పెరిగి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు ప్రమాదాలు ప్రధానంగా అతివేగం, రాంగ్ రూట్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే జరుగుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

జరిమానా విధిస్తున్నా కానరాని మార్పు

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారికి పోలీసులు నిత్యం జరిమానా విధిస్తున్నా మార్పు రావడం లేదు. రాంగ్‌రూట్‌లో రావడం, అతి వేగంతో వాహనాలు నడపడం, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, పరిమితికి మించి ప్రయాణం, హెల్మెట్ లేకుండా, కార్లలో అయితే సీటు బెల్టు ధరించకుండా, వాహనాల నెంబర్ ప్లేట్ లేకుండా, వాహనాల రిజిస్ట్రేషన్ కాగితాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి పోలీసులు జరిమానా విధిస్తున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపిన 2,568 మంది పోలీసులు జరిమానా విధించారు. అతివేగంతో వాహనాలు నడిపిన 1,22,211 మందికి, పరిమితికి మించి ప్రయాణం చేసిన 2,164 మందికి, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలులేని 1,902 మందికి, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 48,943 మందికి, సీటు బెల్టు ధరించని 6,602 మందికి, హెల్మెట్ ధరించని 27,489 మందికి, వాహనాల నెంబరు ప్లేట్ లేని 2,340 మందికి, మద్యం మత్తులో వాహనాలు నడిపిన 10,953 మందికి పోలీసులు జరిమానా విధించారు. జరిమానాల రూపంలో ప్రభుత్వానికి సుమారు రూ.6కోట్ల మేర సమకూరింది. దీంతో పాటు మద్యం మత్తులో వాహనాలు..

- మిగతా 8వ పేజీలో...



సర్వేలో సమగ్ర సమాచారం ఇవ్వాలి

అదనపు కలెక్టర్ రాంబాబు



సింగారెడ్డిపాలెంలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

పెన్‌పహాడ్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా సర్వే టీంకు పూర్తి సమాచారం ఇవ్వాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. ఆదివారం పెన్‌పహాడ్ మండలం సింగారెడ్డిపాలెంలో ఆయన పర్యటించి వివరాలు తెలుసుకున్నారు. సర్వే చేస్తున్న ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. ప్రజలు ఇచ్చే సమగ్ర సమాచారాన్ని క్లుప్తంగా ఎలాంటి తప్పుల్లేకుండా నమోదు చేసుకోవాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వెళ్లి పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం అపరిశుభ్రంగా ఉండడంతో నిర్వాహకులపై ఆగ్రహంవ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లి బీఎల్‌వోల పనితీరును పరిశీలించారు. ఓటరుజాబితా ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దరావత్ లాలునాయక్, ఆర్ఐ రంజిత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అఖిల్, సంఘ బంధం అధ్యక్షురాలు రావి శైలజ, ఐకేపీ నిర్వహకులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

గరిడేపల్లి: ఎన్యూమరేటర్లు ప్రతీ ఇంటిని సందర్శించి పూర్తి సమాచారం సేకరించాలని అదనపు కలెక్టర్ రాంబాబు కోరారు. మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 257 ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని, గ్రామంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. ఆయన వెంట ఏఎస్‌వో గోపి, డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, ఆర్ఐ జి.రాంబాబు, జూనియర్ అసిస్టెంట్ శ్రీను, బీఎల్వో నర్సిరెడ్డి, బొంత స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఆనందం.. ఆహ్లాదం
- ఉల్లాసంగా నాగార్జునసాగర్-శ్రీశైలం ప్రయాణం 6

ఎన్నికల హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మాజీ ఎమ్మెల్యే జూలకంటి

హుజూర్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలుచేయాలని సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సీపీఎం పట్టణ 18వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మహాసభలో రంగారెడ్డి మాట్లాడుతూ దేశంలో కలుషితమైన రాజకీయ పార్టీలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల ముందు మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వస్తున్నారన్నారు. అమెరికా లాంటి పెట్టుబడి దేశాలు ప్రపంచంలోని అనేక దేశాల మధ్య యుద్ధాలను ప్రోత్సహిస్తున్నాయన్నారు. మోదీ మతపరంగా పాలిస్తున్నారన్నారు. మోదీ పాలన లో కార్పొరేట్ శక్తులకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 6 గ్యా రెంటీలను అమలు చేయడం లేదన్నారు. ఈ నెల 29న సూర్యాపేటలో జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, నాగారపు పాండు, పల్లె వెంకటరెడ్డి, పారేపల్లి శేఖర్‌రావు, ప్రకాశ్, బ్రహ్మం, మురళి, యోనా శ్రీను, త్రివేణి, లక్ష్మీ, వెంకన్న, జనార్ధన్, ఎలక సోమయ్య, వీరబాబు, పుల్లయ్య, సైదులు పాల్గొన్నారు.

మట్టపల్లి క్షేత్రానికి పొంచివున్న ప్రమాదం



కరకట్ట ద్వారా మట్టపల్లి ఆలయంలోనికి లీకవుతున్న నీరు

- ఉధృతంగా కృష్ణమ్మ ప్రవాహం
- కరకట్ట లీకేజీతో ఆలయంలోకి రెండు అడుగుల మేర చేరిన నీరు
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా మూడు హైస్పీడ్ మోటర్లతో నీటి తొలగింపు
- మరో కరకట్ట నిర్మించి ఆలయానికి పూర్వ వైభవం తేవాలి: భక్తులు

మఠంపల్లి మండలంలోని మట్టపల్లి క్షేత్రానికి ప్రమాదం పొంచి ఉంది. ఎగువ నుంచి వస్తున్న వరదతోపాటు వర్షాలవల్ల పులిచింతల ప్రాజెక్టుకు పూర్తిస్థాయి నీటిమట్టం చేరుతోంది. దీంతో మట్టపల్లి ఆలయం వద్ద కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది. ఏ సమయంలో ఎలా ఉంటుందో, కృష్ణమ్మ వేగాన్ని అంచనా వేసి చెప్పగలిగే పరిస్థితి లేదు. ఇప్పటికే పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరి నిండు కుండలా మారింది.

- (ఆంధ్రజ్యోతి,మఠంపల్లి)

గత మూడేళ్ల క్రితం నీటిలో మునిగిన ఆలయానికి మళ్లీ అదే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ.3కోట్లతో కరకట్ట నిర్మించినా మట్టపల్లి ఆలయాన్ని వరద ముప్పు తప్పేలా లేదు. ఎగువ ప్రాంతం నుంచి పరవళ్లు తొక్కుతూ వెళ్తున్న కృష్ణమ్మ పరవశం చూసి సంబురపడాలో.., 2020 లో వచ్చిన వరదల మాదిరి గర్భగుడి మునిగిపోతే ఎలా అనే భయంతో భక్తులు ఉన్నారు. రాష్ట్రంలో రెండో యాదగిరిగుట్టగా పేరొందిన మట్టపల్లి వాసుడి దేవాలయం రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధిచెందింది. ఇక్కడ నిత్య పూజలు, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవాలు, తమిళనాడుకు చెందిన ముక్కూరి పీఠం వారి యజ్ఞాలు, పుష్కరాలు, భక్తుల ఇష్టదైవంగా కొలువుదీరి, నెలకు రూ.లక్షల్లో ఆదాయం ఉన్న స్వయంభువుడికి ప్రకృతి వైపరీత్యాలు శాపంగా మారాయి. కృష్ణానది తీర ప్రాంతాల్లోని పంచానారసింహ ఆలయాల్లో ఒకటై ఎంతో ఖ్యాతి పొందిన మట్టపల్లి ఆలయానికి ప్రత్యేక చరిత్ర ఉంది. రెండు రాష్ట్రాల వారధి, సిమెంట్ పరిశ్రమలు, నాపరాయి, రంగురాళ్లకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న ఈ ప్రాంతం పులిచింతల ప్రాజెక్టు నిర్మాణ అనంతరం వరద ముంపునకు గురవుతోంది. గత 2020 ఆగస్టు 12 నుంచి 26 వరకు మట్టపల్లి ఆలయం వరద ముంపునకు గురికాగా, నాలుగు రోజులపాటు లక్ష్మీనరసింహుడు నీటిలో మునిగిపోగా అర్చకులు మెడ లోతు నీటిలో గర్భగుడిలోకి వెళ్లి ఆర్జిత సేవలు అందించారు.భక్తులు కూడా స్వామి దర్శనానికి ఇబ్బందులు పడ్డారు. అకాల వర్షాలకు కృష్ణాదికి ఎగువ ప్రాంతం నుంచి భారీగా వస్తున్న వరదనీటితో ఆలయ కరకట్ట లీకేజీ అయి గుడిలోకి నీరు చేరింది. ప్రసుత్తం పుష్కర ఘాట్లు మునిగి అడుగుల మేర కరకట్ట నుంచి లీకేజీ అవుతున్న నీరు ఆలయంలోకి వస్తుండగా, పాలకవర్గం రెండు హైస్పీడ్ మోటార్ల ద్వారా నీటిని ఎప్పటికప్పుడు తోడేస్తోంది.

ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ

పులిచింతల ప్రాజెక్టుకు నీటి వరద పెరుగుతోంది. సాధారణంగా ప్రాజెక్టులో సుమారు 32 టీఎంసీల నీటి నిల్వ ఉంటే పుష్కర ఘాట్లు, ఆలయ మెట్లు మునిగిపోతాయి. అదే 36 టీఎంసీలు ఉన్న నీటినిల్వతో మట్టపల్లి ఆలయంలోకి కరకట్ట లీకేజీ ద్వారా ఆలయంలో వరద వచ్చి చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో సుమారు 44టీఎంసీల నీరు నిల్వ ఉండటంతో దేవాలయం వద్ద కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తుండగా, కరకట్టకు సుమారు ఐదు అడుగుల



అంచులో నీరు చేరి లీకేజీ అవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, జిల్లా మంత్రి స్పందించి సమస్యను పరిష్కరించాలని మట్టపల్లివాసుడి భక్తులు కోరుతున్నారు.

మద్యపానాన్ని నిషేధించాలి



మద్యపాన నిషేధంపై ఆందోళన నిర్వహిస్తున్న గ్రామస్థులు

ఆత్మకూర్(ఎస్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మద్యపానంతో మండలంలోని బోరింగ్‌తండాలో ఏడాదికి వందలాది మంది మృతిచెందుతున్నారని, వెంటనే మద్యపానం నిషేధించాలని మహిళా సంఘాలు, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని బోరింగ్ తండాలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో చాలామంది మద్యం కారణంగా అనారోగ్యంతో చనిపోతున్నారని, బెల్ట్ షాపులు తొలగించి గ్రామంలో మద్యపానాన్ని నిషేధించాలన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి నాలుగ రోజుల క్రితం నోటీసులు ఇచ్చినా, స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ఆందోళనకు మండల జేఏసీ మద్దతు తెలిపింది.

కల్యాణం.. కమనీయం


మఠంపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మట్టపల్లి లక్ష్మీనృసింహుని నిత్యకల్యాణం ఆదివారం కమనీయంగా సాగింది. భక్తవత్సలునికి నిజాభిషేకం, నిత్యార్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం ఆర్జిత కైంకర్యాలు కొనసాగాయి. కల్యాణ మూర్తులను పరిణయ వేదికపై అధిష్ఠింపజేసి, పుణ్యాహవచనం చేశారు. మాంగల్యధారణ, యజ్ఞోపవీతధారణలు అనంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్యాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

రేపు బహిరంగ వేలం

నిల్వ చేసిన తలనీలాల బహిరంగ వేలం రేపు నిర్వహించనున్నట్లు మట్టపల్లి ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవోసిరికొండనవీన్ ఆదివారం ఒకప్రకటనలో తెలిపారు.మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించే ఈవేలంలో స్వామివారి పేరున రూ.50 వేలు డిపాజిట్ చేసి పాల్గొనాలని కోరారు. వివరాలకు కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.



కల్యాణ తంతు నిర్వహిస్తున్న వేదపండితులు



వి'చిత్రం'
- స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ జోనర్‌లో తిరుగులేని ప్రతిభ
- అంతర్జాతీయ స్థాయిలో ఎదుగుతున్న ఆంజనేయులు 6

నేత్రపర్వంగా హనుమంతుడి అలంకార సేవ

కోదాడ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దోరకుంట గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం పత్తిపాక కృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు వం గిపురం పవన్‌కుమార్ బృందంచే స్వామివారికి నిర్వహించిన అలంకార సేవ నేత్రపర్వంగా సాగింది. అనంతరం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రామాయణ మన్యసూక్త హోమాలు, మహా పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. స్వామివారిని సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి అరటిపండ్లతో అల ంకరించారు. వేడుకల్లో భాగంగా సోమవారం స్వామివారి మూల నక్షత్రం సందర్భంగా పాలు, పంచామృత ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి, అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



సర్వేకు ప్రజలు పూర్తి సమాచారం ఇవ్వాలి

సూర్యాపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమగ్ర సర్వేలో ప్రజలు పూర్తి సమాచారం ఇవ్వాలని మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 39 వార్డులో సర్వేను పరిశీలించి మాట్లాడారు. ప్రజలు ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకుని ఎన్యూమరేటర్లకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, కౌన్సిలర్ మొరిశెట్టి సుధారాణి, గోపారపు రాజు, మొరిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి, తిరుమలగిరి రూరల్): మండలంలో గుండెపురి, బండ్లపల్లి, వెలిశాల గ్రామాల్లో సర్వేను తహసీల్దార్ బి.హరిప్రసాద్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 500 కుటుంబాల సర్వే పూర్తి చేశామన్నారు. ఈ సర్వేలో 62మంది ఎన్యూమరేటర్లు, ఆరుగురు సూపర్‌వైజర్లు, 12మంది కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొంటున్నారని, 7,124 ఇళ్లలో సర్వే కొనసాగుతుందన్నారు.



ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ బి.శ్రీనివాస్

వి'చిత్రం'

● స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ జోనర్‌లో తిరుగులేని ప్రతిభ
● అంతర్జాతీయ స్థాయిలో ఎదుగుతున్న ఆంజనేయులు



ఏదైనా కళ్లతో చూస్తేనే కానీ నమ్మలేం అంటాం.. ఎందుకంటే మన కళ్లు మనని మోసం చేయవని. కానీ ఆంజనేయులు వేసిన పెయింటింగ్ చూస్తే మన కళ్లు మనని మోసం చేయడం ఖాయం. సహజత్వం ఉట్టిపడేలా ఉంటాయి ఆయన వేసిన చిత్రాలు. ఒకసారి తాకిచూస్తేనే కానీ అవి ఫొటోలు కావు పెయింటింగ్ అని తెలియడానికి, పోల్చలేనంతలా ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లోని వస్తువులకు ఆధునికతను జోడించి ఇప్పటి వారికి నచ్చేలా వేస్తాడు. ఆయన చిత్రం వైపు కన్ను పడిందంటే చాలు కొన్ని నిమిషాలు అలా అలవోకగా గడిచిపోతాయి. ఒక చిత్రం కోసం ఎన్నో గంటలను ధారపోస్తాడు. దేశంలో స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ పెయింటింగ్ రంగంలో ఎదుగుతున్న ఆంజనేయులు జీవన ప్రస్థానం ఇది.

(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)







సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలకేంద్రంలో చేనేత కుటుంబానికి చెందిన గుండు సత్యం, లక్ష్మమ్మలకు ఐదుగురు సంతానంలో ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురు కుమారులు చిత్రకళలో తమ ప్రతిభను చాటుకుంటున్నారు. మూడోకుమారుడు ఆంజనేయులు చిత్రకళలో రియలిస్టిక్ పద్ధతిలో అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సాధిస్తున్నారు. తండ్రి మగ్గం పడితే కుమారుడు కుంచె పట్టి దానికి పదును పెట్టి దానినే తన వృత్తిగా మలుచుకున్నాడు. ఉన్నది ఉన్నట్లు, ఉండదు కనికట్టు అన్నట్టుగా రియలిస్టిక్ పద్ధతిలో అనేక చిత్రాలను రూపొందిస్తున్నారు.

ఎన్నో ఆటుపోట్లు

ప్రతీ ఏడాది చిత్రకళను నేర్చుకుని కళాకారులుగా ఎంతోమంది కళాశాలల నుంచి వస్తుంటారు. అలా వచ్చిన వారిలో వెయ్యిలో ఒకరిద్దరూ తప్ప ఆ రంగంలో ఉచ్ఛస్థాయికి చేరుకోలేరు. అది అంతసాధ్యమయ్యేది కాదు. ఆర్థిక వనరులు, సామాజిక పరిస్థితులతో పాటు అన్నింటిని మించి మార్కెట్‌లో దక్కాల్సిన ఆదరణ అనేది ఒక ఆర్టిస్ట్ ఎదుగుదలకు ఉన్న అతిపెద్ద ప్రతిబంధకం. వీటికి తోడు చిత్రకళా రంగంలో కొత్తదనం లేకుంటే ఏ చిత్రానికైనా గుర్తింపు రాదు. జెఎన్‌టీయూలో ఫైన్‌ఆర్ట్‌లో చదివిన ఆంజనేయులు 2002లో చిత్రకళా రంగంలో అడుగుపెట్టినప్పటికే రాష్ట్రంలో ఎంతోమంది పేరుగాంచిన చిత్రకారులున్నారు. వారందరితో పోటీ పడుతూ చిత్రకళా ఎగ్జిబిషన్‌కు ఎంపిక కావడం ఆయనకు సవాల్‌గా మారింది. దీంతో స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ జోనర్‌లో తన ప్రతిభకు పదునుపెట్టారు. 2006లో హైదరాబాద్‌లో తన చిత్రాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు మంచి స్పందన వచ్చినా, ఆర్థికంగా పెద్దగా విజయవంతంకాలేదు. అయినప్పటికీ కుటుంబంలో ఆర్థిక ఆటుపోట్లను ఎదుర్కొంటూనే నిరాశ చెందకుండా ఎన్నో చిత్రాలు వేశారు. ఆ తర్వాత 2013, 2015లో సోలో ఆర్ట్ షో ఎగ్జిబిషన్స్ నిర్వహించారు. ఢిల్లీలో జరిగిన అనేక పెయింటింగ్ ప్రదర్శనల్లో ఆంజనేయులు గీసిన స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ చిత్రాలు ఆకట్టుకోగా వాటిని ఖరీదైన రేటుకు కొనుగోలు చేశారు.

> **హృదయాన్ని పెట్టాల్సిందే**
>
> సాధారణ పెయింటింగ్ వేరు. స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ పెయింటింగ్ వేరు. వస్తువులో మన మనస్సు, ప్రాణాన్ని పెట్టాల్సిందే.ఇన్ని గంటలు, రోజులు అని నిర్ధిష్టంగా చెప్పలేం. ఒక్కోసారి నెలలు పడుతుంది. ఆర్టిస్టలకు తమ ప్రయాణంలో గుర్తింపు అనే అత్యంత క్లిష్టమైన అంశం. వినూత్నంగా, ప్రస్తుత సమాజాన్ని ఆకట్టుకునేలా ఉంటేనే చిత్రాలకు, వారికి మనుగడ ఉంటుంది. ఏస్థాయిలో ఉన్నాయన్నది కాదు, ఎంతమంది హృదయాల్లో గుర్తింపుగా ఉండిపోతామనేది లక్ష్యంగా ఉండాలి.
>
> **గుండు ఆంజనేయులు,**
> **స్టిల్ లైఫ్ రియలిస్టిక్ ఆర్టిస్ట్**





పలువురి ప్రశంసలు

ఆంజనేయులు వేసిన స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ చిత్రాలు దేశంలోని ఎంతో మంది ప్రముఖులను ఆకట్టుకున్నాయి. అన్నింటిలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం ప్రశంసను మరిచిపోలేనని ఆంజనేయులు అన్నారు. 2014లో హైదరాబాద్‌లో మెట్రో పోలీస్ సదస్సుకు వచ్చిన సందర్భంగా ఆర్ట్ ఎట్ తెలంగాణ నిర్వహించిన ప్రదర్శనలో ఆంజనేయులు గీసిన స్టీల్‌బిందె పెయింటింగ్ నచ్చడంతో రాష్ట్రపతి అబ్దుల్‌కలాం ఆంజనేయులును పిలిపించుకుని అభినందించారు. ఇటీవల నికిల్‌కామత్ పాడ్‌కాస్ట్‌లో ఆంజనేయులు చిత్రాలపై చర్చలో ప్రస్తావించారు.



సామాన్యుడి వస్తువులే చిత్రాలు

పోలినట్లుగా ఉండటం వేరు, ప్రాణం పోసినట్లుగా ఉండటం వేరు అంటారు ఆంజనేయులు. అందుకే తన చిత్రాల్లో ఏచిత్రమైనా మనస్సును తాకేలా ఉంటుందంటారు. గ్రామీణ నేపథ్యాన్ని పట్టణ ఆధునికీకరణను, ఫ్యాషన్ ప్రపంచాన్ని, కంప్యూటర్ టెక్నాలజీని తన కుంచె ద్వారా చిత్రిస్తున్నారు. ఇంట్లోని వస్తువులు స్టీల్‌బిందెలు, బకెట్లు, మగ్గులు ఇలా ఇంట్లో ఏ వస్తువు కనపడినా దానిని ఫొటోచేసి స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ పద్ధతిలో ద్వారా అచ్చు గుద్దినట్లు వేస్తున్నారు ఆంజనేయులు.

మలుపుతిప్పిన ఢిల్లీ ఎగ్జిబిషన్



ఇండియా ఆర్ట్ ఫెయిర్ 2018లో ఢిల్లీలో నిర్వహించారు. ఈ ఫెయిర్‌కు కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ వంటి ఎంతోమంది ప్రజాప్రతినిధులు, కార్పొరేట్లు, వివిధ రంగాల్లో పేరెన్నికగన్న వారు హాజరయ్యారు. అందులో ఆంజనేయులు వేసిన పెయింటింగ్ అందరినీ ఆకట్టుకుంది. వచ్చిన వారిలో చాలామంది పెయింటింగ్‌ను తదేకంగా చూస్తూ ఉండిపోవడం ఆర్ట్ ఫెయిర్ నిర్వాహకులను ఆకట్టుకుంది. ఇక అక్కడి నుంచి తన పట్ల చిత్రకళారంగంలోని వారి ఆదరణలో మార్పు వచ్చిందంటారు ఆంజనేయులు. ఆ తర్వాత దుబాయ్, పారిస్, అమెరికాతో పాటు వివిధ దేశాల్లో ఆంజనేయులు తన చిత్రాలను ప్రదర్శించారు.



చార్మినార్ వద్ద గంటల సమయం

ఒక్కో పెయింటింగ్‌కు ఎన్నో గంటల సమయం పడుతుందని, ఒక్కోసారి రెండు, మూడు నెలల పాటు పెయింటింగ్ కోసం శ్రమించాల్సి వస్తుందని ఆంజనేయులు పేర్కొన్నారు. తాను వేసిన చార్మినార్ పరిసర ప్రాంతాలతో కూడిన చిత్రానికి రెండు నెలల సమయం పట్టిందని, ఇందుకోసం చార్మినార్ చుట్టు ప్రాంతాలను గమనించడానికే తాను రెండు నెలల సమయం తీసుకున్నట్లు తెలిపారు. ఆంజనేయులు గీసిన వాటిలో టేప్‌రికార్డర్ పెయింటింగ్ అత్యధిక ధరకు విక్రయించారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సుప్రభాత సేవతో యాదగిరీశుడు, అమ్మవారలను మేల్కొల్పిన అర్చకులు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయ రీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణపర్వాలు వైభవంగా చేపట్టారు. అదేవిధంగా పాతగుట్ట స్వామి అమ్మవారలకు నిత్యపూజలు ఘనంగా చేపట్టారు. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్యపూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వార బంధనం చేశారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు సతీమణి ఉష స్వామివారిని దర్శించుకున్నారు. యాదగిరీశుడి క్షేత్రాన్ని ఆదివారం 40వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

నేటి నుంచి జోనల్‌స్థాయి క్రీడలు ప్రారంభం

డిండి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ(బాలికల) గురుకుల పాఠశాలలో ఈ నెల 11 నుంచి 14 వరకు 10వ జోనల్‌స్థాయి క్రీడలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ శిరీష ఆదివారం విలేకరులకు తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని తొమ్మిది సాంఘీక సంక్షేమ బాలికల పాఠశాలలు, కళాశాలలకు చెందిన 800 మంది విద్యార్థినులు, 18 పీఈటీలు క్రీడలలో పాల్గొంటారని ఆమె తెలిపారు. అండర్ 14, 17, 19 విభాగాల్లో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, క్యారం, అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, టెన్నికాయిట్ క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడల ప్రారంభోత్సవానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి హాజరవుతారని తెలిపారు.

రాజాపేట : మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల్లో 10వ జోనల్‌స్థాయి క్రీడలు ఈనెల 11 నుంచి 14 తేదీ వరకు నిర్వహించనున్నారు. క్రీడాల్లో జనగామ, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లా నుంచి క్రీడాకారులు రాజాపేటకు చేరుకున్నారు. ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య క్రీడలను ప్రారంభిస్తారని జోనల్ ఆఫీసర్ విద్యారాణి, ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు.

క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన విద్యార్థులు వివిధ క్రీడల్లో సత్తాచాటి, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రగ్బీ, వాలీబాల్, హాకీ, చెస్ పోటీలకు సంబంధించి విద్యార్థులు చాటారు. వీరు ఆయా విభాగాల్లో తమ కేటగిరీలకు సంబంధించి పోటీల్లో తలపడనున్నారు.

● రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు వెల్లంకి విద్యార్థులు



రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో అధ్యాపకులు

రామన్నపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మల్కాజ్‌గిరిలో జరుగుతున్న తెలంగాణ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు రామన్నపేట మండలం వెల్లంకి ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి సురేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల దేవరకొండలో జరిగిన అండర్-17 జిల్లాస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన జి.అభినయశ్రీ, ఈ శివలీల, సీహెచ్ శ్రీలక్ష్మి, జి అవంతిక, కే.తనుశ్రీ, జి.అక్షయ, ఎస్.వైష్ణవి, జే.చైతన్య డి.అక్షితలు ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. మేడ్చల్ మల్కాజ్‌గిరిలో మూడురోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టుకు వారు ప్రాతినిధ్యం వహిస్తారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, పీడీ రేణుకను ప్రధానోపాధ్యాయుడు సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయుల సత్తిరెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, సీహెచ్ యాదగిరి, పారిజాత, ఉమామహేశ్వరి, స్వప్న, హేమలత అభినందించారు.

జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఆదిత్య



జాతీయస్థాయి చెస్ పోటీలకు రామన్నపేట మండలంలోని మునిపంపుల గ్రామానికి చెందిన ఆకుల ఆదిత్య ఎంపికయ్యాడు. ఈ నెల 9వ తేదీన మేడ్చల్ మల్క్‌జ్‌గిరి జిల్లాకేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి ఆకుల ఆదిత్య మంచి ప్రతిభ కనబరిచాడు. మధ్యప్రదేశ్‌లోని నర్మదాపురంలో ఈ నెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి చెస్ పోటీల్లో పాల్గొననున్నాడు. ఆదిత్య ప్రస్తుతం బొమ్మలరామారం మండలంలోని టీఎస్ మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదిత్య జాతీయస్థాయి క్రీ డాపోటీలకు ఎంపిక కావడంపై మునిపంపుల గ్రామస్థులు, బొమ్మలరామారం, టీఎస్ మోడల్‌స్కూల్, ఆధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాలీబాల్ పోటీలకు హరీష్



హరీష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఆధ్యాపక బృందం

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 10: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న మల్లాపురం గ్రామానికి చెందిన పుర్మ సంపత్ త్వరలో మహబూబ్‌నగర్‌లో నిర్వహిచే అండర్-19 వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మంజుల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల జిల్లాకేంద్రంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థి సంపత్‌ను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ జట్టుకు కెప్టెన్‌గా మౌనిక



డిండి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు డిండి మండలం చెర్కుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇస్లావత్ మౌనిక కెప్టెన్‌గా ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గోప్యానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ప్రతిభను కనబర్చిన ఇస్లావత్ మౌనికను జాతీయస్థాయిలో ఆడే కబడ్డీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ నెల 7, 8వ తేదీల్లో యాదాద్రి జిల్లాలోని మాదాపూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో అండర్ 14(బాలికల) విభాగంలో మౌనిక ఆడి తన సత్తా చాటింది. అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

హాకీ పోటీలకు అశ్విత ఎంపిక



అశ్వితను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ బృందం


చిట్యాల, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి): చిట్యాల గ్రీన్ గ్రోవ్ పాఠశాలకు చెందిన పిట్టల అశ్విత అండర్-17 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 8న నల్లగొండ మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అశ్విత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అశ్వితను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఆనందం.. ఆహ్లాదం

● ఉల్లాసంగా నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం ప్రయాణం ● 110 కిలోమీటర్లకు 6గంటల సమయం ●బుధ, శనివారాల్లోనూ రాకపోకలు



ప్రకృతి అందాలను వీక్షిస్తూ..



ప్రయాణంలో అందమైన అనుభూతులెన్నో..



శ్రీశైలంకు బయలుదేరి వెళుతున్న లాంచీ



ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ నుంచి ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీశైలం వరకు పర్యాటకశాఖ ఆధ్వర్యంలో లాంచీ ప్రయాణం ఇటీవల ప్రారంభమైంది. 110 కిలోమీటర్ల దూరం ఉన్న శ్రీశైలం వరకు 6 గంటల పాటు ఈ ప్రయాణం సాగుతుంది. దట్టమైన నలమల అందాల నడుమ కృష్ణమ్మ ఒడిలో లాహిరి...లాహిరి... లాహిరిలో అంటూ ఆహ్లాదకరంగా లాంచీ ప్రయాణం సాగుతోంది. పక్షుల కిలకిల రావాలు, ప్రకృతి అందాలను తిలకిస్తూ పర్యాటకులు సాయంత్రం 5గంటలకు శ్రీశైలం చేరుకుంటారు. ఇక నుంచి పర్యాటకుల రాక మేరకు బుధ, శనివారాల్లో సాగర్-శ్రీశైలం లాంచీ ప్రయాణం కొనసాగిస్తామని పర్యాటకశాఖ అధికారులు తెలిపారు.

● (ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)



ఉల్లాసం..ఉత్సాహం



లాంచీని నడుపుతూ..



లాంచీలో శ్రీశైలం వెళుతున్న పర్యాటకులు





బతుకు పోరులో.. మత్స్యకారులు







ప్రకృతి రమణీయం..

దూసుకొచ్చిన మృత్యువు

● ఇటుకల లోడ్ ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు.. మహిళ మృతి



ట్రాక్టర్‌పై దూసుకెళ్లిన ట్రావెల్స్ బస్సు

దామరచర్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. మట్టి ఇటుకల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొనడంతో ఓ మహిళ మృత్యువాత పడింది. మరో ఇద్దరికి తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని వాడపల్లి శివారులో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ నుంచి ఏపీలోని దాచేపల్లికి మట్టి ఇటుకలు దిగుమతి చేసేందుకు మండలంలోని బొత్తలపాలెం గ్రామానికి చెందిన మంద విమలమ్మ, నందిపాటి ఎల్లమ్మ, పోలెపల్లి మంగారమ్మ ట్రాక్టర్‌పై వెళ్తున్నారు. హైదరాబాద్ నుంచి ఒంగోలుకు వెళ్తున్న కావేరి ట్రావెల్ బస్సు వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ట్రక్కు బోల్తాపడి ఇంజిన్ వెనుక భాగంలో కూర్చున్న మంద విమలమ్మ(36)పై ఇటుకలు పడడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఎల్లమ్మ, బంగారమ్మలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడకు తరలించారు. విమలమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. భర్త మెషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ తెలిపారు. ప్రమాద సమయంలో బస్సులో 36మంది ప్రయాణికులు ఉన్నారు. వీరికి ఎలాంటి గాయాలు కాలేదు.



రోడ్డు దాటుతుండగా..

చిట్యాలరూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ ఎన్. ధర్మ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన కొల్లా రఘునాథ్ గుప్తా(43) హైదరాబాద్ ప్రాంతంలో సెక్యూరిటీగార్డ్‌గా పనిచేస్తున్నాడు. గుండ్రాంపల్లిలోని వెంచర్‌లో తనకున్న ప్లాటును చూసుకునేందుకు వచ్చి ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో అవతలి వైపునకు రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని..



శ్రీనివాసరావు(ఫైల్), మస్తాన్ మృతదేహం

మఠంపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు మృతిచెందారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని సాగర్ సిమెంట్స్ పరిశ్రమ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎన్‌సీఎల్‌లోని బైసన్ బోర్డులో పనిచేస్తున్న రఘునాథపాలెం గ్రామానికి చెందిన సంగు శ్రీనివాస్‌రావు, తన భార్య నీలిమాతో కలిసి ద్విచక్ర వాహనంపై ఎన్‌సీఎల్ పరిశ్రమకు బయలు దేరాడు. పెదవీడు గ్రామానికి చెందిన అదే పరిశ్రమలో సిమెంట్‌లోడ్‌లో పనిచేస్తున్న షేక్ మస్తాన్ పెదవీడు నుంచి మఠంపల్లికి బైక్‌పై వెళ్తుండగా సాగర్ సిమెంట్స్ సమీపంలోని రైల్వే వంతెన వద్ద రెండు ద్విచక్ర వాహనాలు అతివేగంగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సంగు శ్రీనివాస్‌రావు(31), షేక్ మస్తాన్(35) అక్కడికక్కడే మృతిచెందారు. శ్రీనివాస్‌రావు భార్య నీలిమాకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను 108లో హుజూర్‌నగర్‌కు తర్వాత మెరుగైన చికిత్సకోసం కుటుంబసభ్యులు ఖమ్మం తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. శ్రీనివాస్‌రావు భార్య ఎన్‌సీఎల్ పరిశ్రమలో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో శనివారం సాయంత్రం భార్యాభర్తలు స్వగ్రామం రఘునాథపాలెం వచ్చి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మస్తాన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనతో రఘునాథపాలెం, పెదవీడు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

లైంగికదాడి కేసులో నిందితుడికి రిమాండ్

చందంపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని ఓ గ్రామంలో బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడి చేసిన నిందితుడిని రిమాండ్‌కు పంపించారు. వరుసకు బావ అయిన తిరుపతి ఈనెల 8వ తేదీన బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడ్డాడని కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు.

రైతుబీమా అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు నారి అయిలయ్య

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంట పెట్టుబడి కోసం రైతు భరోసా పథకం, రైతులందరికీ గత ప్రభుత్వం మాదిరిగా ఉచిత బీమా సౌకర్యం అమలుచేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలకేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలను అమలుచేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కుంబాలపల్లి ఆనంద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కంభంపాటి శంకర్, సీపీఎం మండల కార్యదర్శి పెరిక విజయ్, నాయకులు చందునాయక్, మండల లక్ష్మమ్మ, చిరంజీవి, సత్యనారాయణచారి, దేవయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

CLASSIFIEDS

వధువు కావలెను

★ ఆర్యవైశ్య అమ్మాయి కావలెను. ఆర్యవైశ్య అబ్బాయి 35, M.Ed వ్యవసాయం ప్రైవేట్ లెక్చరర్, 23 వేలు, ఆస్తి ½ కోటి నల్లగొండ మ్యారేజ్ బ్రైస్ మాట్లాడొద్దు, సెల్ : 9121325068

AJY_161982

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటీ

4 Lines CLASSIFIED

NLG+SRPT+YGT (3Dist)

210/-Only

Extra Line 45/- Only

For Ads Contact :

NALGONDA DIST
9985413365
9985413656

SURYAPET DIST
9703618713,
9985401015


YADADRI BHONGIRI DIST
9985410384

కార్తీక మాసమంతా..

శివలింగంపై భానుడి కిరణాలు

● భృగుమహర్షి పేరున బూరుగడ్డగా నామకరణం ● నాడు 108 శివాలయాలతో ఆధ్యాత్మికతకు చిరునామా





శివలింగంపై పడుతున్న సూర్యకిరణాలు, బూరుగడ్డలోని శివాలయం

భృగుమహర్షి తపస్సు చేసిన బూరుగడ్డ గ్రామం ఆధ్యాత్మికతకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఆ మహర్షి పేరు మీదనే బూరుగడ్డ గ్రామంగా విరాజిల్లుతున్న ఈ ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణంతో విరాజిల్లుతోంది. ఒకనాడు 108 శివాలయాలతో వర్ధిల్లిన బూరుగడ్డ గ్రామం నేడు నల్లకట్ట సంతాన ఇష్టకామేశ్వరి సమేత శంభులింగేశ్వరస్వామి శివలింగంపై సూర్యకిరణాల నృత్యాలతో ఎంతో విశిష్టతను సంతరించుకుంది.

(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామంలోని నల్లకట్ట సంతానకామేశ్వరి సమేత శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 5వ తేదీన కార్తీకమాసం సందర్భంగా శివలింగంపై సూర్యకిరణాలు ప్రసరించాయి. కాగా ఉదయం 6 గంటల నుంచి 30 నిమిషాల పాటు శివలింగాన్ని సూర్యకిరణాలు తాకాయి. ఈ శివాలయంలో కార్తీకమాసం మొదటి రోజు నుంచి 30 రోజుల పాటు శివలింగంపై ఉదయం 6 గంటల నుంచి 6.30 గంట లవరకు సూర్యకిరణాలు ప్రకాశించడం ఈ ఆలయం ప్రత్యేకత అని అర్చకుడు రవీంద్రాచార్యులు తెలిపారు. భక్తులు కార్తీకమాసంలో అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. చైర్మన్ చిమ్మట చిన్న సైదులు, అర్చకుడు గుంటిపల్లి రవీంద్రాచార్యులు ఆధ్వర్యంలో పూజలు కొనసాగుతున్నాయి. బూరుగడ్డ గ్రామంలోని నల్లకట్ట సంతాన కామేశ్వరి శంభులింగేశ్వరస్వామి దేవాలయాన్ని కాకతీయుల కాలంలో నల్లచెరువు కట్టపై నిర్మించగా, అది శిథిలావస్థకు చేరడంతో 2011లో ఈ ఆలయాన్ని పునర్నిర్మించారు. 2012లో అప్పటి శివలింగాన్నే తిరిగి పునః ప్రతిష్ఠించారు. నాటి నుంచి ఈనాటి వరకు ప్రతి కార్తీకమాసంలో శివలింగాన్ని సూర్యకిరణాలు తాకుతుంటాయి. ఒకనాడు బూరుగడ్డలో 108 శివాలయాలు ఉండేవి. భృగు మహర్షి తపస్సు చేసిన ఈ ప్రాంతం శివాలయాలతో విరాజిల్లేది. కాగా 1800 సంవత్సరాల క్రితం కాకతీయుల కాలంలో సత్రం బొల్లంరాజు బూరుగడ్డ గ్రామంలో శ్రీఆదివరాహ, లక్ష్మీనర్సింహ, శ్రీవేణుగోపాల స్వామి దేవతామూర్తులను ఒక పీఠంపై ప్రతిష్ఠింపజేశారు. కాగా రానురాను శివాలయాలు కనుమరుగు కాగా ప్రస్తుతం రెండే శివాలయాలున్నాయి. వాటిలో నల్లకట్ట సంతాన ఇష్టకామేశ్వరి సమేత శంభులింగేశ్వర స్వామి దేవాలయం ఒకటి కాగా, ఈ ఆలయం 2012 నుంచి ప్రతీ కార్తీకమాసం ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంటూ కార్తీకమాసమంతా శివలింగంపై సూర్యకిరణాల వెలుగులు విరజిమ్ముతున్నాయి.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.132	210	240
సూర్యాపేట	రూ.140	210	240
నల్లగొండ	రూ.150	220	250

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	587.20
టీఎంసీలు	305.6242
ఎడమకాల్వకు నీటి విడుదల	3,608
కుడికాల్వకు	10,120
విద్యుత్ కేంద్రం ద్వారా	00
ఎస్ఎల్‌బీసీ ద్వారా	18,00 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	21,600 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	21,600 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	44.89 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	8,828 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	12,000క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.87 అడుగులు
టీఎంసీలు	4.17
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	518.51 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	369.01 క్యూసెక్కులు

మిర్యాలగూడలో కార్డన్ సెర్చ్ .. వాహనాలు సీజ్



గాంధీనగర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను కార్డన్ సెర్చ్‌లో పోలీసులు సీజ్ చేశారు. నల్లగొండజిల్లా మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌లో డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పోలీసులు బృందాలుగా విడిపోయి నాకాబందీ నిర్వహించారు. కాలనీలోని ప్రతి ఇంట్లో తనిఖీలు జరిపారు. డీఎస్పీ మాట్లాడుతూ నార్కోటిక్ డాగ్‌స్క్వాడ్ సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. నెంబరు ప్లేట్లు, ఆర్సీలు లేని 30 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు కరుణాకర్, నాగార్జున, ఎస్‌ఐలు మోహన్, కృష్ణయ్య, శేఖర్, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

చిట్టీల పేరిట జెన్‌కో ఉద్యోగి చీటింగ్

● రూ.93.18లక్షలు ఎగవేత ● నాలుగో తరగతి ఉద్యోగుల నుంచి ఎస్‌ఈ వరకు బాధితులే

నాగార్జునసాగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లల భవిష్యత్తు కోసం, ఉన్నత చదువులు, పెళ్లిళ్లు, ఇతర కుటుంబ అవసరాల కోసం డబ్బులు దాచుకోవాలని వారంతా చిట్టీలు వేశారు. నెలంతా కష్టపడి సంపాదించిన సొమ్మును ఉద్యోగులందరూ కలిసి తోటి ఉద్యోగికి నమ్మకంతో ఇచ్చారు. చిట్టీ కట్టిన ఉద్యోగులకు సదరు వ్యక్తి తన భార్య పేరిట కోర్టు ద్వారా ఐపీ నోటీసులు(దివాలా దరఖాస్తు) పంపించడంతో పోలీసులను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలో జెన్‌కో కార్యాలయ ఆర్టిజన్ తుర్క శ్రీనివాస్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఫైర్ అండ్ సేఫ్టీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. 2017లో అడవిదేవుపల్లిలోని టెయిల్‌పాండ్ జలవిద్యుత్ కేంద్రం నుంచి సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి బదిలీపై వచ్చాడు. టెయిల్‌పాండ్ వద్ద పనిచేసిన సమయంలోనూ స్థానికంగా చిట్టీలు నిర్వహించాడు. అదే విధంగా సాగర్‌లో కూడా నాలుగో తరగతి ఉద్యోగి నుంచి ఎస్‌ఈ వరకు రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు చిట్టీలు వేయించాడు. చిటీలు పాడుకున్న వారికి డబ్బులు ఇవ్వకుండా అప్పు తీసుకున్నట్లు ఏడాదిగా ప్రామిసరీ నోట్లు రాసిస్తూ వచ్చాడు. సాగర్ జెన్‌కో కార్యాలయంలో పనిచేస్తున్న మొత్తం 40 మంది వద్ద సుమారు రూ.కోటి మేరకు చిట్టీలు వేయించాడు. చిట్టీ డబ్బులు ఇవ్వకుండా రెండు నెలలుగా కాలం వెలిబుచ్చుతుండటం, మాటలు మారుస్తుండటంతో తోటి ఉద్యోగులకు అనుమానం వచ్చింది. తమకు ఇవ్వాల్సిన నగదు త్వరగా చెల్లించాల్సిన గత నెలలో నిలదీశారు. దీంతో శ్రీనివాస్ సదరు ఉద్యోగి నాలుగు రోజులు విధులకు హాజరు కాకపోవడం, ఫోన్ స్విచ్ఆఫ్‌చేసి ఉండటం, స్థానికంగా లేకపోవటంతో సాగర్ హిల్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆచూకీ తెలుసుకుని సాగర్‌కు రావాలని చెప్పటంతో ఈ నెల 1వ తేదీన పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. అందరి డబ్బులు ఇస్తానని ఎస్‌ఐ సంపత్ ఎదుట అంగీకరించాడు. ఈ నెల 5వ తేదీనుంచి చిట్టీ కట్టిన చిరుద్యోగి నుంచి ఎస్‌ఈ వరకు మొత్తం 37 మందికి రూ.93.18 లక్షలకు కోర్టు ద్వారా తన భార్య లక్ష్మీపద్మావతి పేరిట ఐపీ నోటీసులు (దివాలా దరఖాస్తు) పంపించాడు. దీంతో బాధితులు తమ గోడును విలేకరుల ఎదుట వెళ్లబోసుకున్నారు. తాము కట్టిన చిట్టీ డబ్బుతో తుర్క శ్రీనివాస్ ఆయన భార్య లక్ష్మీపద్మావతి పేరిట ఆంధ్రప్రదేశ్‌లో భూములు కొన్నాడని బాధితులు చెబుతున్నారు. డబ్బులు ఇవ్వకుండా ఉండాలనే భార్య పేరున ఐపీ నోటీసులు పంపించాడని ఆరోపిస్తున్నారు. తమను మోసం చేసిన శ్రీనివాస్‌పై చట్టపరంగా చర్యలు తీసుకుని తమ డబ్బులు ఇప్పించాలని బాధితులు వేడుకుంటున్నారు.

విహారయాత్రలో విషాదం

● కృష్ణానదిలో నీటమునిగి యువకుడు మృతి



అనిల్ మృతదేహం

నేరేడుగొమ్ము, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆ యువకుల విహార యాత్ర విషాదంగా మారింది. వారిలో ఓ యువకుడు నీటి మునిగి మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీ ఆదివారం జరిగింది. నేరేడుగొమ్ము ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన కొమ్ము రాములు, నాగమ్మ దంపతుల కుమారుడు అనిల్(24) పది సంవత్సరాలుగా సికింద్రాబాద్‌లోని బోయపల్లిలో నివాసముంటున్నాడు. అక్కడే ఓ ప్రైవేట్ కొరియర్ సంస్థలో పనిచేస్తున్నాడు. అతని స్నేహితులు అప్పారావు, అశోక్ అదే సంస్థ పనిచేస్తున్నారు. ఈ ముగ్గురు కలిసి ద్విచక్ర వాహనంపై ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు వైజాగ్‌కాలనీ విహార యాత్రకు వచ్చారు. కొమ్ము అనిల్ కృష్ణానదిలో దిగి స్నానం చేస్తుండగా ప్రమాదవ శాత్తు కాలుజారి నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు కేకలు వేయడంతో వైజాగ్‌కాలనీ మత్స్యకారులు అటుగా వచ్చి నీటిలో మునిగిన అనిల్‌ను బయటికి తెచ్చారు. అప్పటికే అనిల్ మృతిచెందాడు. స్థానికులు, స్నేహితులు నేరేడు గొమ్ము పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ సతీష్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనిల్ తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అనిల్‌కు భార్య సంధ్య, కుమారుడు ఉన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య



వెంకన్న (ఫైల్)

నల్లగొండ క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుటుంబసమస్యల కారణంగా ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. నల్లగొండ రూరల్ ఎస్‌ఐ సైదాబాబు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని లైన్‌వాడకు చెందిన కదారి వెంకన్న అలియాస్ కోటి(52) ఆదివారం పట్టణ శివారులోని ఓ తోట దగ్గరల్లో ఉన్న వెంచర్‌లో చెట్టుకు చీరతో ఉరి వేసుకున్నాడు. వెంకన్న కొన్నేళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. యాదవ సంఘంలో చురుకుగా పనిచేస్తున్నాడు. వెంకన్న కుమారుడు కళ్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

10.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

గుర్రంపోడు నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని పోచంపల్లి గ్రామంలో ఆదివారం 10.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు కిరాణా వ్యాపారులపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మధు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామంలో కిరాణ వ్యాపారులు రేషన్‌కార్డు లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని అక్రమంగా సేకరించి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న సమాచారం మేరకు ఎస్ మధు, సిబ్బందితో కలిసి దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామానికి చెందిన తేలుకుంట్ల యాదయ్య వద్ద ఐదు క్వింటాళ్ల, దాచేపల్లి వెంకటయ్య వద్ద అక్రమంగా నిల్వఉంచిన 5.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రజా పంపిణీ బియ్యాన్ని అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆరుగాలం కష్టం రోడ్డు పాలు..

● ధాన్యం ట్రాక్టర్‌ను ఢీకొన్న డీసీఎం.. రోడ్డుపై పడిపోయిన ధాన్యం



ట్రాక్టర్ ట్రాలీ నుంచి రోడ్డుపై పడిపోయిన ధాన్యం, ధ్వంసమైన ట్రాక్టర్ ఇంజన్

వేములపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంట విక్రయించడానికి తీసుకెళ్తుండగా రోడ్డు పాలైంది. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఇండ్లూరుకు చెందిన రైతు జక్కలి మంగయ్య శనివారం సాయంత్రం రెండు ఎకరాల పొలం కోసి తన ట్రాక్టర్‌లో ఆదివారం ఉదయం వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులోగల మిల్లుల వద్దకు చేరుకున్నాడు. మహర్షి రైస్‌మిల్లు సమీపంలో మిర్యాలగూడ నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న డీసీఎం అతివేగంగా వచ్చి ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొంది. ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న సుమారు 75బస్తాల ధాన్యం(44 క్వింటాళ్లు) రోడ్డుపై పడింది. ట్రాక్టర్ ఇంజన్ దెబ్బతిని రెండుగా విడిపోయింది. రైతు మంగయ్య స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ధాన్యాన్ని మరో ట్రాక్టర్‌లో లోడ్ చేయించి మిల్లుకు తరలించారు. 40 క్వింటాళ్లు విక్రయించగా, సుమారు నాలుగు క్వింటాళ్ల ధాన్యం మట్టిపాలైందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు రూ.10వేల నష్టం వాటిల్లిందని, ట్రాక్టర్ ఇంజన్, ట్రక్కు దెబ్బతినడంతో సుమారు రూ.7లక్షల వరకు నష్టపోయానని వాపోయాడు.

సీఎం, మంత్రికి మంచి బుద్ధి ప్రసాదించాలి

● యాదాద్రి భువనగిరి జిల్లా సంగెంలో భీమలింగేశ్వరుడికి అభిషేకాలు



సంగెంలో భీమలింగానికి పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వలిగొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని బీఆర్ఎస్ నాయకులు భీమలింగేశ్వరుడిని వేడుకున్నారు. ఆదివారం యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని సంగెం గ్రామంలో భీమలింగానికి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కీసర రాంరెడ్డి, కాసుల కృష్ణ, వరికుప్పల మల్లేష్ మాట్లాడుతూ ఈ నెల 8న మూసీ పునరుజ్జీవ యాత్ర పేరుతో సంగెం గ్రామానికి సీఎం, జిల్లా మంత్రి వచ్చిన సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. 'బుల్డోజర్లతో తొక్కిస్తా.. కుక్క చావు చస్తావు' అంటూ హింసను ప్రేరేపించే విధంగా మాట్లాడారని సీఎం, మంత్రిపై వలిగొండ పోలీస్‌స్టేషన్లో ఫిర్యా దు చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్ సురకంటి వెంకట్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మాజీ కో-ఆర్డినేటర్ పడమటి మమత, నాయకులు తుమ్మల వెంకట్‌రెడ్డి, అఫ్రోజ్, పల్సం రమేష్, నాయకులు వలమల్ల కృష్ణ, మద్దెల మంజుల, డేగల పాండు, ఎడ్ల నిరంజన్‌రెడ్డి, మద్దెల సందీప్, మారయ్య, శేఖర్, నరేష్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ICICI Bank నమోదిత కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్, చక్లి సర్కిల్ సమీపాన, పాత పద్రా రోడ్, వడోదర - 390 007
కార్పొరేట్ కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి 400 051.

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

బంగారు ఆభరణాల సౌకర్యం నిమిత్తం ICICI బ్యాంక్ లిమిటెడ్ (ICICI బ్యాంక్) నుండి పొందిన (సౌకర్యం) తమ బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు నోటీసు జారీచేయడమైనది. వారు బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాలను నవంబర్ 21, 2024న ఇ-వేలం వేయడానికి మాకు తప్పనిసరి అయ్యింది. ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే ఖాతాను తొలగించడానికి/ ఇ-వేలం తేదీని మార్పు చేయడానికి ICICI బ్యాంక్‌కు అధికారం ఉంది. వేలం - https://gold.samil.in ఆన్‌లైన్‌లో మ.12:30 గం. నుండి మ.3:30 గం. మధ్య నిర్వహించబడుతుంది. సవివరమైన నియమ నిబంధనల కోసం ఇవ్వబడిన వెబ్‌సైట్‌కు లాగిన్ అవండి. మరణించిన రుణగ్రహీత విషయంలో, వారి న్యాయవారసులకు అన్ని నియమ నిబంధనలు వర్తిస్తాయి.

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: ఆదిలాబాద్-రాజీవ్‌నగర్	
664805601140	కాటిపెల్లి మహేందర్ రెడ్డి
శాఖ పేరు: ఆర్మూర్	
069505010449	[illegible]
శాఖ పేరు: [illegible]	
222605000796	[illegible] శ్రీకాంత్
శాఖ పేరు: భైంసా	
395505005506	[illegible]
శాఖ పేరు: చందంపేట	
220105001057	[illegible]
220105000221	[illegible]
220105000821	[illegible]
శాఖ పేరు: ఘట్‌కేసర్	
179305006232	[illegible]
శాఖ పేరు: గోదావరిఖని	
068205008799	పోతుగంటి కుమార్
068205009463	పోతుగంటి కుమార్
068205007478	[illegible] శ్రీకాంత్
శాఖ పేరు: [illegible]నగర్	
431405004295	[illegible]
శాఖ పేరు: హైదరాబాద్ [illegible]	
437405000557	[illegible]
శాఖ పేరు: హైదరాబాద్- [illegible]	
782605000017	[illegible]
శాఖ పేరు: హైదరాబాద్- [illegible]	
787705000058	[illegible] సురేష్
శాఖ పేరు: హైదరాబాద్- [illegible]	
465605000078	షేక్ [illegible]
శాఖ పేరు: హైదరాబాద్- [illegible]నగర్	
236105001573	షేక్ [illegible]
శాఖ పేరు: హైదరాబాద్- [illegible]	
112205002242	సయ్యద్ అబ్దుల్ రహీం
శాఖ పేరు: హైదరాబాద్- [illegible] నగర్	
024405006667	క రాజేంద్ర ప్రసాద్
శాఖ పేరు: హైదరాబాద్-[illegible]నగర్	
238405000779	[illegible] కుమార్
శాఖ పేరు: హైదరాబాద్-[illegible]	
000805027129	[illegible] విజయ కుమార్
శాఖ పేరు: హైదరాబాద్-[illegible] రోడ్	
386705000794	[illegible]
శాఖ పేరు: హైదరాబాద్ - [illegible]	
024505008109	[illegible]
శాఖ పేరు: [illegible]	
237305000303	[illegible]
శాఖ పేరు: [illegible]	
280805006765	[illegible]
శాఖ పేరు: జనగాం	
070305014478	మల్లికార్జున రావు [illegible]
శాఖ పేరు: కామారెడ్డి	
069605016869	[illegible] శ్రీనివాస్
శాఖ పేరు: మహబూబ్‌నగర్	
068905032022	[illegible]
శాఖ పేరు: [illegible]	
131505001802	[illegible] కుమార్
శాఖ పేరు: [illegible]	
061805011254	[illegible]
శాఖ పేరు: మెదక్	
069005021730	[illegible] కుమారి
శాఖ పేరు: ముథోల్-ఆంధ్రప్రదేశ్	
204505005694	[illegible]
శాఖ పేరు: నిర్మల్	
153305010533	[illegible]
శాఖ పేరు: పెద్దపల్లి	
068305020785	[illegible] కుమార్
068305017947	[illegible]
068305012709	[illegible]
068305007677	[illegible]
068305020704	[illegible] రెడ్డి
068305020834	[illegible] రెడ్డి
068305020839	[illegible] రెడ్డి
శాఖ పేరు: [illegible]	
130405002269	[illegible]
శాఖ పేరు: [illegible]	
286505001549	[illegible]
శాఖ పేరు: సిద్దిపేట	
069105022523	[illegible]
069105020590	[illegible]
069105021442	[illegible]
069105019321	[illegible]
069105022063	[illegible]
శాఖ పేరు: [illegible]	
222305001161	[illegible]
శాఖ పేరు: [illegible]	
131105023698	మల్లికార్జున్ [illegible]
శాఖ పేరు: వరంగల్	
020105011703	[illegible] రెడ్డి
020105012477	[illegible]
020105012638	[illegible] రెడ్డి
శాఖ పేరు: [illegible]	
322705001519	[illegible]
శాఖ పేరు: [illegible]	
059505003217	[illegible]

తేది:11.10.2024
ప్రదేశము : మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, సూర్యాపేట, హన్మకొండ, జనగాం, నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల్, మెదక్, సిద్దిపేట, హైదరాబాద్, పెద్దపల్లి, రాజన్న, జగిత్యాల, మహబూబ్‌నగర్, జోగులాంబ, వనపర్తి, కామారెడ్డి, నిజామాబాద్

సం/- అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున

సమాచారం

సీపీఎం పట్టణ కార్యదర్శిగా వెంకటరెడ్డి



హుజూర్‌నగర్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీపీఎం పట్టణ కార్యదర్శిగా పల్లె వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శిగా పల్లె వెంకటరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా, మరికొంతమందిని కమిటీ సభ్యులుగా నియమించారు. పల్లె వెంకటరెడ్డిని రాష్ట్ర రైతు సంఘం కమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డిని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి నాగార్జునరెడ్డి, నాగారపు పాండు, పారేపల్లి శేఖర్ తదితరులు అభినందించారు.

సీపీఎం మండల కార్యదర్శిగా వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు



యాకుబ్

పెన్‌పహాడ్, గరిడేపల్లి నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీపీఎం పెన్‌పహాడ్ మండల కార్యదర్శిగా గుంజ వెంకటేశ్వర్లు, గరిడేపల్లి మండల కార్యదర్శిగా అబ్బిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన షేక్ యాకుబ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. శనివారం లింగాలలో, గరిడేపల్లిలో జరిగిన సీపీఎం మండల మహాసభల్లో వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్షుడిగా సతీష్‌కుమార్



సతీష్‌కుమార్

సూర్యాపేటటౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన మిట్టకోల సతీష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మశాలీ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కోట వీరయ్య. జనరల్ సెక్రెటరీగా రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వరకాల శ్రీనివాస్, కోజాయింట్ సెక్రెటరీగా వరకాల ప్రవీణ్, వైస్ ప్రెసిడెంట్‌గా గంజి శ్రీనివాస్, కోశాధికారిగా మిట్టకోల మధు, వరకాల నవీన్, కార్యవర్గ సభ్యులుగా ఏలె ప్రభాకర్, వై.రమేష్, మిట్టకోల కోటయ్య, మల్లికార్జున్, శ్రీకాంత్, సరస్వతి, కొక్కుల సంపత్‌కుమార్, కొక్కుల శ్యాం, పాండు, గంజి సైదేష్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నాయకుడు గోపాల్ మృతి



గోపాల్ (ఫైల్)

హుజూర్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ నాయకుడు వేముల గోపాల్ (80)ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఆరుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. హమాలీ కార్మికుడిగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు. గోపాల్ మృతదేహానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ నివాళులర్పించి మాట్లాడుతూ గోపాల్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. గోపాల్ మృతి కి సీపీఐ నాయకులు గుండు వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, , కాంగ్రెస్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, ఇందిరాల వెంకటేశ్వర్లు, వేముల వెంకటేశ్వర్లు సంతాపం తెలిపారు.

పబ్లిక్ డిమాండ్
PUBLIC DEMAND

దళారులపై చర్యలు తీసుకోవాలి

నేరేడుచర్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా లైసెన్స్ లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్న దళారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం నేరేడుచర్లలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళారులు సిండికేట్‌గా మారి రోజుకో ధర నిర్ణయిస్తూ రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా దళారుల రాజ్యం నడుస్తోందన్నారు. ఆయన వెంట నాయకులు కత్తి శ్రీనివాసరెడ్డి, చిలకరాజు శ్రీను ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలి

నూతనకల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వెంటనే కొనుగోళ్లను ప్రారంభించాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించినా, కాంటాలు ప్రారంభించనందున రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో వెంకట్‌రెడ్డి, భిక్షం పాల్గొన్నారు.

నెరవేరని దాతృత్వం

సూర్యాపేట ఆసుపత్రిలో మూలనపడిన పారిశుధ్య యంత్రాలు





సూర్యాపేట ఆసుపత్రిలో మూలనపడిన ఫ్లోర్ క్లీనింగ్ మిషన్, వాక్యూమ్ క్లీనర్



మరమ్మతుకు గురైన పిచికారీ యంత్రం

సూర్యాపేట సిటీ, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశుభ్రతకు దాతలు స్పందించి యంత్రాలు సమకూర్చితే వాటి నిర్వహణ కొరవడినందున నిరుపయోగంగా మారాయి. 2020 సంవత్సరంలో కోవిడ్ ఆపత్కాల సమయంలో సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో క్వారెంటైన్ కేంద్రాలు ఏర్పాటు చేసి కోవిడ్ పాజిటివ్ రోగులకు చికిత్స అందించారు. క్వారెంటైన్ కేంద్రాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం కోసం తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం అనే స్వచ్ఛంద సంస్థకు చెందిన కొంతమంది ఎన్నారైలు రూ.5లక్షలు విలువ చేసే ఫ్లోర్ క్లీనింగ్ మిషన్, వాక్యూమ్ క్లీనర్, పిచికారీ యంత్రాలను అప్పటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్ రెడ్డికి అందజేశారు. కరోనా సమయంలో ఈ పారిశుధ్య యంత్రాలతో ఆసుపత్రిలో సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించి ఆసుపత్రిని శుభ్రంగా ఉంచారు. ఆరు నెలల క్రితం ఈ యంత్రాలు మరమ్మతుకు గురవ్వడంతో వాటిని ఆసుపత్రిలో ఓ మూలన పెట్టారు. ఈ యంత్రాలను అధికారులు మరమ్మతు చేయిస్తే కొన్నేళ్లపాటు పనిచేస్తాయని స్థానికులు చెబుతున్నారు. ఆసుపత్రిలో ఉన్న ఈ యంత్రాలపై అధికారులు దృష్టి సారించనందున నిరుపయోగంగా మారాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో మూలన పడిన పారిశుధ్య యంత్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకువస్తా



జనరల్ ఆసుపత్రికి పారిశుధ్య యంత్రాలు దాతలు ఇచ్చిన సమయంలో నేను లేను. పారిశుధ్య యంత్రాలు మరమ్మతుకు గురైన విషయం ఇప్పటివరకు నా దృష్టికి రాలేదు. ఆసుపత్రి సిబ్బందితో పారిశుధ్య యంత్రాలు పరిశీలన చేయించి, ఏ కారణంతో యంత్రాలు మరమ్మతుకు గురయ్యాయో తెలుసుకుంటా. యంత్రాలకు మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకురావడానికి యత్నిస్తా.

- డాక్టర్ జె.సత్యనారాయణ, సూర్యాపేట జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్

వన భోజనాలు ఐక్యతకు ప్రతీక



కోదాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వన భోజన మహోత్సవాలు ఐక్యత, స్నేహ భావానికి ప్రతీక అని ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి, కాకతీయ కమ్మ సంక్షేమ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు ఎర్నేని బాబు అన్నారు. కమ్మసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కోదాడ శివారులోని ఇండస్ట్రియల్ పార్క్ సమీపంలోని బాబు తోటలో వన భోజన మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సంప్రదాయంగా వన భోజన మహోత్సవాలను కొనసాగించడం అభినందనీయమని అన్నారు. అన్ని రంగాల్లో కమ్మ కులస్థులు అగ్రస్థానంలో ఉండి అందరికీ ఆదర్శంగా ఉండాలని సూచించారు. ముందుగా ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతిని కమ్మ సంక్షేమ సభ్యులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, మునిసిపల్ ఛైర్‌పర్సన్ సామినేని ప్రమీల, సంఘం ప్రతినిధులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

జిల్లాలో గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తా



రామారావును సన్మానిస్తున్న పబ్లిక్ క్లబ్ మిత్ర బృందం

కోదాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రంథాలయాలను ఆదర్శంగా అభివృద్ధి చేస్తానని జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. ఆదివారం పబ్లిక్ క్లబ్ మిత్ర బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచడంతో పాటు గ్రంథాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తానన్నారు. కోదాడ గ్రంథాలయంలో చదువుకుని ఇటీవల ప్రభుత్వ కొలువులు సాధించిన పలువురు విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అనంతరాములు, వేనేపల్లి సత్యనారాయణ, బొడ్ల మదన్మోహన్, ఈశ్వర్‌రావు, మూర్తి, సత్యనారాయణ, శివరామయ్య, నాగేశ్వరావు, బాలమ్మ పాల్గొన్నారు.

ఉండ్రుగొండను పర్యాటకంగా తీర్చిదిద్దుతా



సూర్యాపేటలో మాట్లాడుతున్న డాక్టర్ రామ్మూర్తియాదవ్

సూర్యాపేట టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చివ్వెంల మండలంలోని ఉండ్రుగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని దేవాలయ అభివృద్ధి ఛైర్మన్ పూర రామ్మూర్తియాదవ్ అన్నారు. ఉండ్రుగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా రామ్మూర్తియాదవ్ ఎన్నికైన సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని నివాసంలో ఆయనను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా రామ్మూర్తియాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉండ్రుగొండ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2.50 కోట్లు విడుదల చేసిందన్నారు. దేవాలయ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ ఆదూర్తి రామయ్య, జనరల్ సెక్రెటరీగా మహేశ్వరం రవిచంద్ర ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సభ్యులు దేవిరెడ్డి రవీందర్‌రెడ్డి, రాచర్ల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలే ఎజెండాగా పోరాటాలు



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న గన్నా చంద్రశేఖర్

హుజూర్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలే ఎజెండాగా పోరాటాలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ కోరారు. సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎర్రజెండా నీడలోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యమన్నారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు చేయాలన్నారు. కమ్యూనిస్టుల పోరాటాలను ప్రజలు ఆదరించాలన్నారు. పేదలకు ఎర్రజెండా అండగా ఉంటుందన్నారు. సీపీఐ వందేళ్ల వేడుకలకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. దేశవ్యాప్తంగా కమ్యూనిస్టులు బలపడాల్సిన అవసరం ఉందన్నారు. శ్రామిక వర్గానికి అండగా ఉంటామని, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు. చట్ట సభలలో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం ఎంతో అవసరమన్నారు. అనంతరం సీపీఐ ఉద్యమాల్లో పాల్గొన్న అనేకమంది నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కంబాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, ఎం.వెంకటేశ్వర్లు, ధనుంజయనాయుడు, జడ శ్రీనివాస్‌యాదవ్, సత్యనారాయణ, దేవరం మల్లీశ్వరి, సుందరి పద్మ, రమేష్, వెంకయ్య, శ్రీనివాస్, కృష్ణ, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఉపేందర్‌కు కాళోజీ ప్రతిభా పురస్కారం



హైదరాబాద్ రవీంద్రభారతిలో పురస్కారాన్ని అందుకుంటున్న ఉపేందర్

మోతె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారత కల్చరల్ అకాడమి, తెలుగు టెలివిజన్ రచయితల సంఘం సంయుక్తంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ నెల 9వ తేదీన ప్రజాకవి కాళోజీ స్మారక జాతీయ స్థాయి కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోతె మండలం నామవరం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు చిట్యాల ఉపేందర్ 'అరణ్య రోదన' అనే కవితను ఆలపించారు. ఆ కవితకు ఉపేందర్‌కు ప్రశంసాపత్రం, జ్ఞాపికను తెలుగు టెలివిజన్ ఫెడరేషన్ స్థాపక అధ్యక్షుడు నాగబాల సురేష్‌కుమార్, భారత్ కల్చరల్ అకాడమీ ప్రధాన కార్యదర్శి మడిపల్లి దక్షిణామూర్తి, తెలుగు టీవీ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కర్రా నరేందర్‌రెడ్డి, సినీ గేయ రచయితలు సాధనాల వెంకటస్వామి, వెనిగళ్ల రాంబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, సినీ దర్శకుడు ప్రభాకర్‌జైనీ, అప్పాల చక్రధర్, విజయబాల ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు పాల్గొన్నారు

దళారుల దోపిడీ నుంచి రైతులను కాపాడాలి



మఠంపల్లి సీపీఎం కార్యాలయంలో మాట్లాడుతున్న పాండునాయక్

మఠంపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దళారులు, మిల్లర్ల దోపిడీ నుంచి రైతులను కాపాడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండు నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఐకేపీ కేంద్రాలను తక్షణమే ప్రారంభించి క్వింటాకు రూ.3వేల మద్దతు ధర కల్పించాలన్నారు. దళారులు, మిలర్లు తక్కువ ధరకు సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని, వీరిని ప్రభుత్వం కట్టడి చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్, రైతు సంఘం నాయకులు శాగంరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, సయ్యద్ రన్‌మియా, రాము, హరి, శంభయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మోతె, హుజూర్‌నగర్, నూతనకల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మోతె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1993-94బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆట-పాటలతో సందడి చేయడంతో పాటు ఆనాటి ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేసి సన్మానించారు.

● హుజూర్‌నగర్‌పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్న పాఠశాలలో 1985-86బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం హైదరబాద్‌లోని సింగపూర్ టౌన్‌షిప్ ప్రాంగణంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పిల్లలమర్రి రాము, నర్సింహారావు, వాసా శ్రీనివాసు, శంభుని సాయిబాబు, శివరామకృష్ణ, అనంతరామశర్మ, రామిశెట్టి నాగేశ్వరరావు, ఆకుల రాము, గురుపాదం, బ్రహ్మం, పాల్గొన్నారు.

● నూతన్‌కల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-86బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు సాబాది వెంకట్‌రెడ్డి, సీపీఎల్ ప్రసాద్, ప్రభాకరాచారి, బిక్కి గురువయ్య, బత్తుల వెంకటనర్సు, పోలోజు వెంకటాచారి, రజాక్, మహిమూద్, దామోదర్‌రెడి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

ప్రజా సమస్యపై పోరాటం చేస్తాం.. సూర్యాపేట టౌన్: ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోకినపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గాంధీపార్కులో ఏర్పాటు చేసిన అమరవీరుల సంస్మరణ సభ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.అనంతరం వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి రేణుక, కారింగుల వెంకన్న, ఎర్రఅఖిల్‌కుమార్, పేర్ల నాగయ్య, వేర్పుల లక్ష్మయ్య, నర్సయ్య, పల్లయ్య, మారసాని చంద్రకళ, సయ్యద్ హుస్సేన్, లింగయ్య పాల్గొన్నారు.

కేసీఆర్‌ను విమర్శించడం తగదు.. హుజూర్‌నగర్ రూరల్: మాజీ సీఎం కేసీఆర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించడం తగదని మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అమరవరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవులలో ఉన్న వ్యక్తులు బాధ్యతగా ఉండాలన్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం కేసీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. ఈ. సమావేశంలో కామిశెట్టి వెంకటేశ్వర్లు, సుజాత, అంజిరెడ్డి, శ్రీనివాస్, వెంకన్న, రాము పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావాలి.. మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి మహా క్షేత్రంలో రెడ్డి అన్నదాన సత్రం అభివృద్ధికి దాతలు సహాయసహకారాలు అందించాలని సత్రం కమిటీ అధ్యక్షుడు సాముల వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం మట్టపల్లిలో నిర్వహించిన రెడ్డి అన్నదాన సత్రం కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా మట్టపల్లి క్షేత్రానికి వచ్చే భక్తులకు ఉచిత అన్నదానం చేయాలని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ కార్యక్రమంలో సత్రం కమిటీ సభ్యులు భాస్కర్‌రెడ్డి, శంభిరెడ్డి, కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి.. చిలుకూరు: సీపీఐ శత ఆవిర్భావ దినోత్స వాలను మండలంలోని ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.

జరిమానానేగా..వేసుకోనీ!

(5పేజీ తరువాయి)

నడిపిన వారిలో కొంత మందికి వారు సేవించిన మద్యం మోతాదును బట్టి జరిమానాతో పాటు జైలుశిక్ష కూడా విధించారు.

నెత్తురోడుతున్న రహదారులు

జిల్లాలోని రహదారులు నిత్యం నెత్తురోడుతున్నాయి. ప్రతీ రోజు జిల్లాలో ఏదో ఒక రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో చాలా మంది విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. వాహనాల వేగానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నా, పరిమితికి మించి వాహనాలు వేగంగా వెళ్తూనే ఉన్నాయి. వాహనాల వేగాన్ని దూరం నుంచే గుర్తించి జరిమానా విధించేందుకు ఇంటర్‌సెప్టర్ వాహనాలను గతంలో వినియోగంలోకి తెచ్చారు. ప్రస్తుతం ఈ వాహనాలు మూలనపడ్డాయి. అంతేగాక నిర్దేశించిన వేగం కంటే అధికంగా వెళ్తుంటే ఆ వాహనానికి స్పీడ్‌గన్‌తో జరిమానా విధిస్తున్నారు. అయినా జాతీయ రహదారిపై వాహనాల వేగానికి కళ్లెం పడడం లేదు. జిల్లా పరిధిలో ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 472 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అందులో 204 మంది మృతి చెందగా, 456 మంది గాయపడ్డారు. జాతీయ రహదారి నాలుగు లేన్లుగా విస్తరించాక ప్రమాదాలు, మృతుల సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తోంది. జాతీయ రహదారితోపాటు ఇటీవల నూతన రహదారులపై కూడా ఇదే పరిస్థితి ఉంది.

హైవేపై నిలిచిన పెట్రోలింగ్

జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు గతంలో జీఎంఆర్, పోలీస్ శాఖకు చెందిన వాహనాలు నిత్యం పెట్రోలింగ్ నిర్వహించేవి. రహదారిపై వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టేవారు. అంతేకాకుండా ప్రమాదాలు జరిగితే వెంటనే సదరు వాహనాలను రోడ్డు పక్కకు తీయించేవారు. ఇటీవల జీఎంఆర్ సంస్థ పెట్రోలింగ్ చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అదే విధంగా పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు ఉన్నా, వారు రహదారిపై ఎక్కడో ఒక చోట నిలిపి ఉంచుతున్నారే తప్పా పెట్రోలింగ్ చేయడం లేదనే విమర్శలూ ఉన్నాయి.

అతి వేగం, రాంగ్ రూట్

జిల్లాలో అత్యధిక రోడ్డు ప్రమాదాలు అతివేగం, రాంగ్‌రూట్‌లో ప్రయాణం కారణంగా జరుగుతున్నాయి. జిల్లాలోని జాతీయ రహదారులపై ఉన్న పలు గ్రామాలకు సర్వీస్ రోడ్లు నిర్మించలేదు. దీంతో వాహనదారులు కొంత దూరం జాతీయ రహదారిపై ప్రయాణించి తిరిగి వెనక్కు రావాల్సి వస్తోంది. ఇది దూరం అవుతుండటంతో ఆయా గ్రామస్థులు రాంగ్ రూట్‌లో వెళ్తున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే విధంగా జాతీయ రహదారిపైకి తరచూ గేదెలు అడ్డుగా వస్తున్నాయి. జాతీయ రహదారి మధ్యలో నిర్మించిన డివైడర్లపై ఉన్న గడ్డిని మేస్తూ ఒక్కసారిగా రోడ్డుపైకి వస్తున్నాయి. అలాంటి సందర్భాల్లో వేగంగా వచ్చే వాహనాలు వాటిని కంట్రోల్ చేయలేక ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాలు వచ్చినపుడు జాతీయ రహదారిపై అక్కడక్కడ వర్షపు నీరు నిలుస్తోంది. వాహనాలు వేగంగా వచ్చినపుడు ఆ నీటి వద్ద అదుపు తప్పి ప్రమాదానికి గురవుతున్నాయి. దీంతోపాటు రహదారిపై లారీలను ఎక్కడపడితే అక్కడ నిలిపివేస్తున్నారు. నిలిపివున్న లారీతో కూడా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ప్రమాదాల నివారణకు చర్యలు

65వ జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఇటీవల ఎన్‌హెచ్-65 అధికారులు చర్యలు చేపట్టారు. జాతీయ రహదారిపై తరుచూ ప్రమాదాలను జరిగే ప్రాంతాలను గుర్తించారు. జిల్లా పరిధిలో జాతీయ రహదారిపై 17 బ్లాక్ స్పాట్స్‌ను అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో ప్రస్తుతానికి జీబ్రా లైన్లు ఏర్పాటు చేశారు. మరికొన్ని చోట్ల ప్రత్యేక లైట్లు ఏర్పాటు చేశారు. రోడ్డు క్రాసింగ్‌ల వద్ద సర్వీస్ రోడ్లను నిర్మిస్తున్నారు. అదే విధంగా అండర్‌పాసింగ్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలకు రోడ్డు నిర్మాణ లోపం కారణంగా భావిస్తున్న ప్రాంతాల వద్ద కూడా చర్యలు చేపడితే ప్రమాదాల సంఖ్య తగ్గే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో పోలీస్, జాతీయ రహదారి అభివృద్ధి అధికారులు సంయుక్తంగా ఈ బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించారు. అందులో సూర్యాపేట మండల పరిధిలోని టేకుమట్ల, రాయిగూడెం, జనగాం క్రాస్‌రోడ్డు, అంజనాపురికాలనీ, రాజీవ్‌పార్కు, దురాజ్‌పల్లి, గంజలూరు, మొద్దులచెర్వు స్టేజీ, మునగాల, ముకుందాపురం, ఆకుపాముల, మేళ్లచెర్వు క్రాస్‌రోడ్డు, కోదాడ రూరల్ పరిధిలో రెండు ప్రాంతాల్లో బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించారు. ఇక్కడ ప్రమాదాలు జరగకుండా పూర్తిస్థాయి చర్యలు చేపడుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చర్యలు

జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం వాహనాల తనిఖీలు నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిని గుర్తించి జరిమానా విధిస్తున్నాం. మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిని కోర్టుకు పంపిస్తున్నాం. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు కృషి చేస్తున్నాం. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి వాహనాల వేగాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాం. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు జాగ్రత్తగా నడపాలి. డ్రైవర్ల అజాగ్రత్త వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు పెట్రోలింగ్ కూడా నిర్వహిస్తున్నాం. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు. యువత వేగ నియంత్రణ పాటించాలి. రోడ్డు ప్రమాదాలను అరికట్టే విషయంలో ప్రజల్లో కూడా మార్పు రావాలి.

●సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ